క్లుప్తంగా

విరబూసిన బ్రహ్మకమలం


విరబూసిన బ్రహ్మకమలం


రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు ఇంట్లో బ్రహ్మకమలం విరబూసింది. ఈ అరుదైన బ్రహ్మకమలం మొక్కను మూడేళ్ల క్రితం తన స్నేహితుడు బహుమతిగా ఇచ్చారని సర్పంచ్ తెలిపారు. శనివారం రాత్రి ఈ మొక్క నుంచి సుమారు 12 మొగ్గలు వికసించగా చుట్టు పక్కవారు ఆసక్తిగా తిలకించారు. ఇంకా మరికొన్ని మొగ్గలు ఉన్నాయని సర్పంచ్ వెంకటేశ్వరరావు అంటున్నారు.

మాదిగ మహామేళాను విజయవంతం చేయండి


మాదిగ మహామేళా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, తదితరులు

బొబ్బిలిరూరల్: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7వ తేదీన ఒంగోలు పట్టణంలో నిర్వహించనున్న మాదిగ మహామేళాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ సురగాల లక్ష్మణరావు కోరారు. మండలంలోని అలజంగి గ్రామంలో మాదిగ యువతతో కలిసి మహామేళాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఎన్నో పోరాటాలు చేసి, ఎన్నో విజయాలను అందుకుందని చెప్పారు. నియోజకవర్గంలోని మాదిగ మహిళలు, విద్యావంతులు, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు ఈ మహామేళాకు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. గర్భాపు రమేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

పురుగులు, బురదతో మున్సిపల్ తాగునీరు


బురదగా వచ్చిన తాగునీటిలో ఉన్న చిన్న చిన్న పురుగులు

బొబ్బిలి: పట్టణంలోని చినబజారు ప్రాంతానికి చెందిన వీధుల్లో ఆదివారం కుళాయిల ద్వారా మున్సిపాలిటీ వారు సరఫరా చేసిన తాగునీరు బురద, పురుగులతో రావడంతో మహిళలు, ప్రజలు ఆందోళన చెందారు. ఇటువంటి నీటిని తాగితే రోగాలు రావా అని మహిళలు ప్రశ్నించారు. కొంత మంది తాగునీటిని విలేకరులకు చూపించి విచారం వ్యక్తం చేశారు. ఓవర్ హెడ్ ట్యాంకు శుభ్రం చేసి ఎన్ని రోజులైందోనని వాపోయారు. కుళాయిల ద్వారా సరఫరా చేసిన నీరు తాగేందుకు వీలుగా లేకపోవడంతో ప్రజలు తాగునీటికి అవస్థలు పడ్డారు.

సమరసతా సేవా ఫౌండేషన్ సిబ్బంది నియామకం


నియామక ప్రక్రియ చేపడుతున్న ధర్మప్రచారకులు

బొబ్బిలి: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలోని బాల వికాస కేంద్రాల సిబ్బంది నియామక ప్రక్రియ ఆదివారం నిర్వహించారు. ఉపాధ్యాయ కన్వీనర్ కొల్లూరు జగన్నాథరావు, ధర్మప్రచారకులు ధూపం వాసు, తదితరులు ఆయా బాల వికాస కేంద్రాల్లో పనిచేసేందుకు మాతాజీలు, ఆచార్యులను ఎంపిక చేశారు. ఈ బాలవికాస కేంద్రాలను త్వరలో పార్వతీపురం డివిజన్ పరిధిలో ఏర్పాటు చేయనున్నట్టు వారు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో 14 మండలాల మాతాజీలు పాల్గొన్నారు.

సేవలు మరింత విస్తృతం


భిక్షాటకులకు గొడుగులు పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ మనరాజాం–సారథి సభ్యులు

రాజాం సిటీ: స్థానిక వాసవీక్లబ్, మన రాజాం–సారథి ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తృతం చేస్తున్నామని వాసవీక్లబ్ రీజియన్ చైర్మన్ డాక్టర్ జి.రవికుమార్ తెలిపారు. ఆదివారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆలయానికి వెయ్యిలీటర్ల వాటర్ ట్యాంకుతో పాటు మానసిక వికలాంగులకు వీల్‌చైర్స్, విద్యార్థులకు నోట్‌బుక్స్, 20 మంది భిక్షాటకులు, సాధువులకు గొడుగులు పంపిణీ చేశారు. వాసవీక్లబ్, మన రాజాం–సారథి సభ్యులు కీర్తన, వి.వి.మన్మథరావు, ఉప్పల అంబరీష్, గ్రంధి కామేష్, అభినవ్, నికేష్,తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాల్లో.. భయం భయంగా..

- శిథిలావస్థలో ఇరిగేషన్ కార్యాలయ భవనాలు
- పెచ్చులూడుతున్న శ్లాబ్‌లు, ఊడుతున్న కిటికీలు
- రికార్డులకు రక్షణ కరువు
- మూలకు చేరుతున్న కంప్యూటర్లు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది


శిథిలావస్థలో తోటపల్లి జలాశయం డివిజనల్ అధికారుల కార్యాలయం


అధ్వాన్న స్థితిలో మద్దువలస జలాశయానికి సంబంధించిన ఓ డివిజనల్ కార్యాలయ భవనం

రాజాం: నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖ కార్యాలయాలు శిథిల భవనాల్లో కొనసాగుతున్నాయి. ఎప్పుడో 50 ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలే ఇప్పటికీ ఈ శాఖలకు దిక్కుగా మారాయి. అప్పట్లో ఈ శాఖల నిమిత్తం కేటాయించిన ప్రభుత్వ భూమి ఓ వైపు కబ్జాకు గురవుతోంది. ఇంకో వైపు అప్పట్లో నిర్మించిన భవనాలు ఒక్కొక్కటిగా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఇక్కడి ఉద్యోగులు ఎప్పుడు ఏమవుతుందోనన్న భయాందోళనలో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. పాత భవనాలకు నిర్వహణ లేక, నూతన భవనాలు నిర్మించకపోవడంతో ఇక్కడ ఉండేందుకు అధికారులు ఆసక్తి చూపడంలేదు. ఫలితంగా భవిష్యత్‌లో ఇక్కడ ఇరిగేషన్ కార్యాలయాలు, వాటి విధులు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

పట్టించుకునే వారే కరువయ్యారు..!

రాజాంలో 1976లో తోటపల్లి ప్రాజెక్ట్‌కు సంబంధించి డివిజనల్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అనంతరం 1998లో మద్దువలస జలాశయంకు సంబంధించి మరో రెండు కార్యాలయాల ఏర్పాటుతో పాటు అధికారులు ఉండేందుకు గదులు, మెటీరియల్ కోసం గోదాంలు నిర్మించారు. అప్పట్లో ఇక్కడ 28 ఎకరాల భూమిని సేకరించారు. తోటపల్లి జలాశయంకు సంబంధించి ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని పలుగ్రామాలకు సంబంధించి డివిజన్ల వారీగా మూడు కార్యాలయాలు ఏర్పాటు చేశారు. మద్దువలసకు సంబంధించి రెండు కార్యాలయాలు ఏర్పాటు చేసి విధులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ కార్యాల యాల భవనాల శ్లాబ్‌లు పెచ్చులూడుతూ, కిటికీల తలుపులు, ప్రధాన తలుపులు ఊడిపోయి ప్రమాదకరంగా మారాయి. అప్పట్లో కేటాయించిన విలువైన ఫర్నీచర్, ఇతర సామగ్రి పాడయ్యింది. కంప్యూటర్లు మొరాయిస్తూ మూలకుచేరుతున్నాయి. వీటి స్థానంలో కొత్తవి సమకూర్చలేదు.ఇక్కడి సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో శిథిల భవనాల్లో ఉండలేక డీఈఈలు, ఏఈలు గంటో గడియో కార్యాలయాల్లో గడిపి తిరిగి వెళ్లిపోతున్నారు. దిగువ స్థాయి ఉద్యోగులైన కార్యాలయ సూపరింటెండెంట్‌లు, రికార్డు అసిస్టెంట్‌లు, ఆఫీస్ సబార్డినేటర్లు మాత్రం ఈ శిథిల భవనాల్లోనే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

ఏటా ప్రతిపాదనలు పంపిస్తున్నాం..

నీటిపారుదలశాఖ భవనాల మరమ్మతులు, కొత్తవి నిర్మాణం నిమిత్తం ప్రతీ ఏడాది ప్రతిపాదనలు రీజనల్ కార్యాలయానికి పంపిస్తున్నాం. నిధులు మంజూరు కావడం లేదు. ప్రతీ ఏడాది మెయింటెనెన్స్ నిధులు రావాలి. అవి కూడా విడుదల కావడం లేదు. నూతన భవనాలు, కొత్త కంప్యూటర్ల కోసం ఇటీవల ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం శిథిల భవనాలతో ఇబ్బందులు ఉన్నాయి.

– పి.నాగేశ్వరరావు, మద్దువలస డీఈఈ, రాజాం

క్వార్టర్స్ నిర్మించేదెప్పుడో..?

మద్దువలస, తోటపల్లి నీటి పారుదలశాఖల ఇంజినీరింగ్ అధికారుల ఇళ్ల నిమిత్తం, కార్యాలయాల నిమిత్తం కేటాయించిన ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవు తోంది. ఒక పక్క నుంచి ఈ భూమిని ఆక్రమణదారులు తమ స్థలాల్లో కలుపుతూ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు.గతంలో ఇక్కడ క్వార్టర్స్ నిమిత్తం ప్రతిపాదన లు సిద్ధం చేసి వదిలేశారు. క్వార్టర్స్ లేకపోవడంతో ఇదే సాకుగా ఇక్కడి అధికారులు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లిపోతు న్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో సాగునీటిని సక్రమంగా రైతులకు అందించేలా కాలువల పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఆయా కాలువల వైపు కన్నెత్తి చూడకపోగా...కార్యాలయాల్లో కూడా రైతులకు కనిపించడంలేదు. ఉన్నతాధికారులు దృష్టిసారించి, శిథిల భవనాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావడంతో పాటు అధికారులు స్థానికంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


తోటపల్లి జలాశయం డివిజనల్ కార్యాలయం భవనంలో పెచ్చులూడుతున్న శ్లాబ్


కిటికీలు లేకపోవడంతో అట్టలతో రక్షణ


సిమెంట్ రేకుల గదిలో మద్దువలస జలాశయానికి సంబంధించిన ఓ డివిజనల్ కార్యాలయం


బీరువాలు పాడవ్వడంతో ఇలా ఆరుబయటే రికార్డులు


మద్దువలస జలాశయం కార్యాలయంలో మూలకుచేరిన ఫర్నీచర్

నిధుల దుర్వినియోగానికి పరాకాష్ట


మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: యోగా డే నిమిత్తం విశాఖపట్నంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమం నిధుల దుర్వినియోగానికి పరాకాష్టగా కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆరోపించారు.స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ యోగా డేను గొప్పగా చేయాలనుకుంటే విశాఖపట్నంతో పాటు చుట్టు పక్కల విద్యార్థులు, యువకులు, ఔత్సాహికులను ప్రోత్సహిస్తే సరిపోతుందని, సుదూర ప్రాంతాల నుంచి డ్వాక్రా మహిళలను, విద్యార్థినిలను ఇబ్బందులు పెట్టి తీసుకెళ్లాల్సిన అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు. కోట్ల రూపాయల నిధులు కేటాయించి, చివరకు విద్యార్థులు, మహిళలకు భోజనాలు లేకుండా పస్తులు ఉంచారని, కనీస పర్యవేక్షణ, రక్షణ లేకుండా ఇటువంటి కార్యక్రమాలు చేయడం తగునా అంటూ మండిపడ్డారు. యోగా కార్యక్రమానికి తరలించేందుకు ఆర్టీసీ బస్సులను వాడడంతో రాకపోకలు సాగించేందుకు బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చిందన్నారు. అయిదురోజుల పాటు విశాఖపట్నం వెళ్లి వచ్చే ప్రయాణికులకు చుక్కలు చూపించారని అన్నారు. కూటమి ప్రభుత్వం గిన్నీస్ బుక్ రికార్డుపేరుతో కోట్ల రూపాయలు దోచుకుందని, కేంద్రం మెప్పు కోసం ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సంక్షేమం అటకెక్కి, అప్రజాస్వామ్య పాలన సాగుతోందని దుయ్యబట్టారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం


మామిడికాయలపై రసాయనాలు స్ప్రేచేస్తున్న దృశ్యం

రాజాం: పట్టణంలో మామిడిపండ్ల వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. శ్రీనివాసరోడ్డు సమీపంలో కొంతమంది మామిడి పండ్ల వ్యాపారులు ప్రమాదకర కాల్షియం కార్బైడ్ రసాయనాలను మామిడి కాయలపై స్ప్రే చేసి విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసిన మామిడికాయలను త్వరగా రంగుమారేలా, ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు విచ్చలవిడిగా కెమికల్స్‌ఉపయోగిస్తున్నారు. రంగుతో పుష్టిగా ఉన్న మామిడిపై మోజుతో ప్రజలు కొనుగోలుచేసి క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులబారిన పడుతున్నారు. బహిరంగంగా ఇలా మామిడి కాయలపై ప్రమాదకర రసాయనాలు స్ప్రేచేసి మగ్గబెట్టి విక్రయిస్తున్నప్పటికీ ఇటు శానిటరీ అధికారులతో పాటు ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఈ రసాయనాలతో పండ్లను మగ్గపెట్టే విధానాన్ని సీతాలక్ష్మి థియేటర్ సమీపంలోని అరటి పండ్ల వ్యాపారులు సైతం అనుసరిస్తున్నారు.వీటిపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

సంగాంలో తాగునీటి ఇక్కట్లు


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

వంగర: మండలంలోని సంగాం గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని రక్షిత మంచి నీటి పథకానికి సంబంధం చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడవడంతో వీధి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మూడురోజులుగా తాగునీరు అందక అవస్థలు పడుతున్నా మని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆ గ్రామ మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. గ్రామంలోని హ్యాండ్ బోర్ల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

దివ్యజీవన సత్సంగ సమావేశం


మాట్లాడుతున్న ఎస్.వి.రమణ

రేగిడి: దేవుదల గ్రామంలోని గీతామందిరంలో ఆదివారం దివ్యజీవన సత్సంగ సమావేశం నిర్వహించారు. పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలన్నారు. భగవద్గీత మానవుడిని ఉన్నత స్థితికి చేరు స్తుందని, జీవితానికి సార్థకత చేకూరుతుందని అన్నారు.గురువులను ఆశ్రయించడం ద్వారా మంచి జ్ఞానం అలవడుతుందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక వక్తలు గొర్లె దామోదరరావు, ఏ.కామేశ్వరరావు, సామంతుల దామోదరరావు, డి.సత్యనారాయణ, త్రినాథస్వామి, చందక సింహాచలం, కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సంఘ సేవకులు జేసీ రాజుకు సన్మానం


జేసీ రాజు దంపతులను సత్కరిస్తున్న క్రైస్తవ మత పెద్దలు, తదితరులు

బొబ్బిలి: పట్టణానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు జేసీ రాజు ఇటీవల ఎన్టీఆర్ స్మారక పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా మహారాణిపేట చర్చిలో ఆయన్ని క్రైస్తవ మత బోధకులు ఆదివారం సన్మానించారు. సెయింట్ ఆంధ్రూస్ లూథరన్ బోధకులు రెవరెండ్ జాన్ విక్టర్ మాట్లాడుతూ జేసీ రాజు పేదలకు, అవసరార్థం వచ్చేవారికి మరిన్ని సేవలందిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ తనను సత్కరించిన క్రైస్తవ మత బోధకులు, పెద్దలకు, పట్టణవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. పి.రాజు, రమణ, డెలిగేట్ పీపీఏ మెర్సీబాయ్, వజ్రకుమారి, రాజేశ్వరి, శేఖర్, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల శానిటేషన్ కార్మికుల ధర్నా


ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పాఠశాల శానిటేషన్ కార్మికులు

రాజాం సిటీ: పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు రూ.10వేల గౌరవవేతనం ఇవ్వాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్.రామ్మూర్తినాయు డు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎంఆర్‌సీ వద్ద శానిటేషన్ కార్మికులు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగింపులు లేకుండా తగుచర్యలు తీసుకోవాలని కోరారు. తొమ్మిదేళ్లుగా రూ.6వేలు జీతంతో పనిచేస్తూ కుటుంబ జీవనానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం ఎంఈఓ పి.ప్రవీణ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. పార్వతి, సునీత, గౌరి, అనూరాధ, లక్ష్మి, అరుణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

29న ఆనందో బ్రహ్మ రంగస్థల ప్రదర్శనలు


మాట్లాడుతున్న ఆనందోబ్రహ్మ కార్యవర్గం

బొబ్బిలి: పట్టణంలోని శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో తరచూ పుర ప్రేక్షకుల్ని అలరిస్తున్న ఆనందో బ్రహ్మ రంగస్థల ప్రదర్శనలను ఈనెల 29న మరోసారి నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు మింది విజయమోహనరావు తెలిపారు. ఆదివారం ఆయన ఆనందో బ్రహ్మ కార్యవర్గంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సుమారు 45 మంది స్టేజీ కళాకారులతో రెండు గంటల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో పౌరాణిక, సాంఘిక నాటికలు, నాటకాల్లోని ప్రాధాన్యతాంశాలు, సినీ,జానపద,శాస్త్రీయ నృత్యాలు, ఆధ్యాత్మికతతో నిండిన కోలాట ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే ఆలోచింప జేసే మైమ్ షో, సినీ సంగీత విభావరి, ఏకపాత్రాభి నయాలను ప్రదర్శిస్తామ న్నారు. జి.కరుణ్‌కుమార్, టి.వి.రమణ,ఎం.సీహెచ్.గౌరినాయుడు,రాముద్రి గోవిందరావు, బి.జి.గంగాధర్, కె.రామకృష్ణ, జి.మల్లేశ్వర రావు, వి.రాంబాబు తదితరులు న్నారు.

పైపులైన్లకు మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని అంబేడ్కర్ కూడలికి సమీపంలో తాగునీటి పైపులైన్లకు లీకులు కావడంతో మున్సిపల్ ఆదివారం మరమ్మతులు చేయించారు. పైపులైన్‌కు రెండు వేర్వేరు చోట్ల దగ్గరదగ్గర్లో లీకులు ఏర్పడడంతో నీటి వృథాతో పాటు రోడ్డు కూడా పాడవుతోంది.ఈ విషయాన్ని గమనించిన అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్నారు.

కూలిన కల్వర్టు వద్ద గోడ నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్


అంతర్రాష్ట్ర రోడ్డుపై కల్వర్టు కూలిన చోట గోడ నిర్మిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది సమీపంలోని రాయగడ–రామభద్రపురం రోడ్డులో ఉన్న కాలువపై కల్వర్టు కుప్పకూలిన సంగతి విదితమే. కల్వర్టు కుప్పకూలడంతో ఆదివారం సాక్షి దినపత్రికలో 'కుంగిన రోడ్డు' శీర్షికన వార్త ప్రచురితమైంది. కల్వర్టు రోడ్డుకు సగానికి కూలిపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముందని, త్వరగా అధికారులు మేల్కొనకపోతే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి ఉంటుందని వార్తలో పేర్కొన్న అంశాలకు అధికారులు స్పందించారు. ఆర్అండ్‌బీ ఏఈ బి.ఎ.కె. రాజు వెంటనే కూలిన ప్రాంతంలో వాహనాలు దిగబడకుండా అడ్డంగా గోడను నిర్మాణానికి పూనుకున్నారు. హుటాహుటిన గోడ నిర్మాణానికి అవసరమైన మెటీరియల్, కార్మికులను కాంట్రాక్టరు ద్వారా సమీకరించి నిర్మాణం పూర్తి చేశారు. పోలీసుల ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. యుద్ధ ప్రాతిపదికన ఇక్కడ డబుల్ కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపిస్తామని సిబ్బంది ఏ.ధర్మారావు తదితరులు తెలిపారు.

ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న స్నేహం అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: ఐఐటీ, నీట్‌తోపాటు వివిధ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలకు చెందిన విద్యార్థులను స్నేహం అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు.పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్నేహం అసోసియేషన్ కన్వీనర్ అంబికా కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి ఈ ప్రాంతానికి మంచి పేరుతీసుకురావాలని ఆకాంక్షించారు. వీరిని మిగతా విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యారంగంలో రాజాం ప్రాంతీయులు ఇతర ప్రాంతాల వారికి ప్రేరణగా నిలవాలని అన్నారు. సత్కారం పొందిన వారిలో జేఈఈ అడ్వాన్స్‌లో మంచి ర్యాంకులు సాధించిన బూరె చరణ్‌తేజశ్వని నాయుడు, నడిపిల్లి దినకర్‌ప్రశాంత్, పిల్లా శాంతిప్రియ, పాలవలస పవన్‌తేజ, మురపాక శ్రీనిధి ఉన్నారు. అలాగే నీట్‌కు సంబంధించి మగ్రాపు తులసీభార్గవ్‌రామ్, పాలూరి జ్యోత్స్న, పల్లి తారాచంద్ర, వంజరాపు కార్తీక్‌నాయుడు, లాసెట్‌కు సంబంధించి పొట్నూ కీర్తన, స్పెషల్ ఆచీవ్‌మెంట్‌గా ఐఎస్ఐ ఆలిండియా 27వ ర్యాంకు పొందిన గురవాన లక్ష్మీనారాయణవిష్ణు, ఇండియన్ నేవీ ఆఫీసర్ పున్నాన తవిటి నాయుడు ఉన్నారు. స్నేహం అసోసియేషన్ సభ్యులు కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, బి.వి.అచ్యుత్‌కుమార్, కొల్లా పార్థసారధి, కొత్తా ప్రకాష్‌రావు, కొత్తా శ్రీను, ఉప్పల ప్రసాద్, గట్టి పాపారావు, నీలకంఠేశ్వరయాదవ్, పెంకి చైతన్య, సీమకుర్తి రంగ, నరసయ్య, కొత్తా రమేష్, పొట్నూనాని, కల్యాణచక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో వైద్యశిబిరం

బొబ్బిలిరూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ బొద్దల పద్మ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు బి.రాజేష్, బి.లహరి 123 మందికి వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అంద జేసి, ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. స్థానిక నాయకుడు బొద్దల సత్యనారాయణ,ఎంపీటీసీ సభ్యుడు రౌతు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వీయ సంస్కారాన్ని పెంపొందించేవే శ్రీపతి కథలు


ప్రసంగిస్తున్న కళింగాంధ్ర సాహిత్య విమర్శకులు శాంతారావు

రాజాం సిటీ: స్వీయ సంస్కారాన్ని పెంపొందించుకోవడానికి శ్రీపతి కథలు ఎంతో దోహదపడతాయని కళింగాంధ్ర సాహిత్య విమర్శకులు రాజాపు శాంతారావు అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రాజాం రచయితల వేదిక సమావేశంలో 'శ్రీపతి కథలు–ఒక పరిశీలన' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. శ్రీపతి రాసిన 'మంచుపల్లకీ–మరి తొమ్మిది కథలు' అనే పుస్తకంలోని కథల గురించి వివరించారు. శ్రీపతి కథలు ఆద్యంతమూ ప్రగతిశీల దృక్పథంతో పయనిస్తాయని, మనోవిజ్ఞానాన్ని పెంచుతాయని, వివిధ రకాల మనుషుల మనస్తత్వాల్లోని దొంతరలను వివరిస్తాయని పేర్కొన్నారు.ఈయన కథల్లో ముగింపు విషాదాంతంగా ఉంటుంద ని, అది కూడా మన మధ్యే జరుగుతున్నట్లు పాఠకుడు భావిస్తాడన్నారు. శ్రీపతి రాసిన సత్యజిత్‌రే ఎవరు, నర్తోడు, మంచుపల్లకి, సచ్చిన సావు, అంతర్వాహిని, కుంకుమ, జీవిత పరమార్థం వంటి యాభైకు పైగా కథలు అందరూ చదవాలని సూచించారు. కళింగాంధ్ర భాష, యాస, చరిత్ర, సంస్కృతి ఆయన కథల్లో మెండుగా ఇమిడి ఉంటాయ ని పేర్కొన్నారు. అనంతరం శాంతారావును వేదిక సభ్యులు సత్కరించారు. డాక్టర్ ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వేదిక సభ్యులు పిల్లా తిరుపతి రావు, రౌతు గణపతిరావు నాయుడు, గట్టి పాపారావు, మజ్జి సత్యం, పెంకి దయానిధినాయుడు, పెంకి చైతన్య, పొట్నూరు కోటిబాబు, మూడడ్ల శ్రీనివాసరావు, శాసపు సత్యనారాయణ, సామంతుల రమణ, పల్ల నారాయణరావు, పడాల కవీశ్వరరావు, ఒమ్మి రమణమూర్తి, అంబల్ల రామ్మూర్తి, ఆలుగుబిల్లి బాలమురళి, పొదిలాపు శ్రీనివాసరావు, వి.ఆర్.కె. నాయుడు, ఏ.విశ్వనాథం, కె.తిరుమలరావు పాల్గొన్నారు.